సాక్షి
కుమురం భీం

బుధవారం : 29 : నవంబర్ : 2023



ప్రచార శైలిలో మార్పులు
ప్రచార శైలిలో వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయి. గతంలో కాలినడకన జరిపే ప్రచారం ఇప్పుడు హెలీక్యాప్టర్ల వరకు చేరింది. 2లో▸



కానరాని 'పల్లె వెలుగు'
కౌటాల మండలంలోని పల్లెలకు రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సు సేవలు అందడం లేదు. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. 3లో▸

గరిష్టం/కనిష్టం
30.3 /18.1

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

ప్రచారం.. పరిసమాప్తం

- మాటలు ఆపారు.. మూటలు విప్పారు!
- పల్లెల్లో జోరుగా ప్రలోభాలు
- విచ్చలవిడిగా నగదు పంపిణీ
- గట్టు తెగిన మద్యం.. ఇతర ప్యాకేజీలు



సాక్షి, ఆసిఫాబాద్: తెర ముందు ప్రచారం ముగిసింది. తెర వెనుక కార్యకలాపాలు మొదలయ్యాయి. పల్లెల్లో మందు, డబ్బు సంచులు దిగుతున్నాయి. ఇప్పటికే విచ్చలవిడిగా డబ్బు పంపిణీ సాగుతుండగా, ఓటుకు రూ.500– 1,500 దాకా పంచేందుకు సిద్ధమవుతున్నారు. పోలీసులు నిఘా పెట్టినా.. భారీగా మద్యం, డబ్బు పట్టుకున్నా ప్రలోభాలు తగ్గడం లేదు. మంగళవారం సాయంత్రంతో ప్రచారాన్ని ముగించిన వెంటనే ప్రధాన పార్టీ అభ్యర్థులు ఎన్నికల్లో కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. ఇందుకోసం ఆయా పార్టీలకు చెందిన వ్యూహాత్మక నేతలు రంగంలోకి దిగారు.

బ్యాలెట్ యుద్ధానికి సిద్ధం

బ్యాలెట్ యుద్ధానికి ఇక కేవలం కొన్ని గంటలు మాత్రమే మిగిలిన ఉన్న నేపథ్యంలో తెరచాటు రాజకీయ కార్యకలాపాలకు వ్యూహాలు పన్ని.. ఆ మేరకు అడుగులు వేసేందుకు నాయకులు సిద్ధమవుతున్నారు. ఆ గుర్తుకే మీ ఓటు.. ఈ గుర్తుకే మనందరి ఓట్లు.. అంటూ గత నెల రోజులుగా ఆయా పార్టీల ప్రచార రథాల మైకులు జనం చెవులకు చిల్లులు పెట్టాయి. మేనిఫెస్టోల్లో పేర్కొన్న హామీలతో ఊరించిన నేతలు అసలు సిసలు 'అస్త్రాలు' ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. 30న పోలింగ్ జరగనున్నందున బుధవారం కార్యకర్తలు, నాయకులతో జరిగే భేటీ కీలకం కానుంది. అభ్యర్థులు తాయిలాలతో ఓట్ల వేటకు దిగనున్నారు. తమకు ప్రజాదరణ ఉందని చాలామంది పైకి చెబుతున్నా.. 'పంపకాలు' లేకపోతే అసలుకే మోసం వస్తుందన్న ఆందోళన వారిని వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో భారీ ఎత్తున డబ్బు, మద్యం, ఇతర ప్యాకేజీల ను ఓటర్లకు ఎరవేసి ఆకర్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ప్రధానంగా మైనార్టీ ఓట్లపై గురిపెట్టారు. ముస్లింలు, క్రైస్తవుల మద్దతు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ముస్లిం సంఘాల నాయకులు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులను ప్రత్యేకంగా కలుసుకుని.. ఎన్నికల్లో గెలిచాక సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీలు ఇస్తున్నారు. అవసరమైన చోట నగదు పంపిణీ కూడా చేస్తున్నారు.

ప్రలోభాలు షురూ..

ప్రధాన పార్టీల తరఫున ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులందరూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు ముందు నుంచీ ప్రణాళికతో ఉన్నారు. చివరి క్షణం వరకు వేచివుంటే పోలీసుల ఒత్తిడి ఉంటుందన్న యోచనతో వారం రోజులు ముందుగానే అనుయాయులతో ఓటుకు రూ.500 చొప్పున పంపిణీ చేయించినట్లు తెలిసింది. ప్రత్యర్థి పంపిణీ చేసే సొమ్మును బట్టి మరో విడత పంపిణీకి సైతం సిద్ధంగా ఉన్నారు. ఓటుకు నోటుతో పాటు మందు బాబులకు బాటిళ్లు, బిర్యానీ పొట్లాలు సైతం అందజేస్తున్నారు.

- ఆసిఫాబాద్, సిర్పూర్‌లో ఓ ప్రధాన పార్టీ అభ్యర్థులు పొదుపు సంఘాల(డ్వాక్రా గ్రూపులు) ద్వారా ఓటుకు రూ.500 పంపిణీ చేశారు. రెండో విడత పంపిణీ మంగళవారం అర్ధరాత్రి నుంచి మొదలెట్టారు. ఇప్పటివరకూ దాదాపు రూ.20 కోట్లపైగా ఖర్చు పెట్టినట్లు సమాచారం.
- ఆసిఫాబాద్ నియోజకవర్గానికి వలస వచ్చిన ఓ నేత కూడా ఓటుకు రూ.1000 వరకు పంపిణీ చేస్తున్నారు. జిల్లా కేంద్రం శివారులోని ఓ గ్రామం నుంచి ఈ తంతు నడిపిస్తున్నారు. ఉదయం బైకు ర్యాలీకి వచ్చిన వ్యక్తులకు రూ. 300ల తోపాటు ఓ మద్యం బాటిల్ అందించారు. ఇదే విధంగా సాయంత్రం ప్రచారానికి భారీ ఖర్చు పెట్టారు.
- సిర్పూర్ నియోజకవర్గంలో ఓ ప్రధాన పార్టీ తరఫున బరిలో నిలిచిన సీనియర్ నేత ఒకరు గెలుపు కోసం తీవ్ర యత్నాలు చేస్తున్నారు. ఇక్కడ ఆయనపై పోటీ పడుతున్న రెండు పార్టీల అభ్యర్థులు దూసుకుపోతుండడంతో వారిని దెబ్బకొట్టడానికి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ఓటుకు రూ.1000 నుంచి రూ. 1500 వరకు పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది.
- సిర్పూర్ నియోజకవర్గంలో ఓ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన వ్యక్తి విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. ఓటుకు ఎంతైనా సరే! అంటున్నారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు నోట్ల మూటలను మండలాలు, గ్రామాలకు తరలించినట్లు తెలుస్తోంది. ఈయన ఓటుకు రూ.1000కి పైగా పంపిణీ చేస్తున్నట్లు సమాచారం.

ఈసారి ప్రచారానికి అతిరథులు..

ఎన్నికల ప్రచారం ముగిసింది. మంగళవారం సాయంత్రం దాకా హోరెత్తించిన ప్రచార మైక్‌లు మూగబోయాయి. ఈ సారి అభ్యర్థుల విజయానికి ఆయా పార్టీల అధినేతలు స్వయంగా రంగంలోకి దిగడం విశేషం. అధికార పార్టీ తరఫున బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొని ప్రచారం చేశారు. కాంగ్రెస్ తరఫున ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ జిల్లాకు వచ్చారు. బీజేపీ అభ్యర్థుల తరఫున ఆ పార్టీకి చెందిన జాతీయస్థాయి నేతలతోపాటు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కాగజ్‌నగర్‌లో పర్యటించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు సిర్పూర్ నుంచి పోటీ చేస్తుండటంతో ఆయనే స్వయంగా ఆ నియోజకవర్గంలో గ్రామగ్రామాన పర్యటించి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

రాజకీయ పార్టీలు
సహకరించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమావేశ మందిరంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని, ఓటర్లను మద్యం, నగదు, కానుకల పంపిణీ ద్వారా ప్రలోభాలకు గురి చేయొద్దన్నారు. జిల్లాలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందని తెలిపారు. ప్రచారం కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు నియోజకవర్గాలను వదిలి వెళ్లాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. జిల్లాలో 4,270 గుర్తింపు కార్డులను బూత్ స్థాయి అధికారుల ద్వారా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీకి సిద్ధంగా ఉండాలి
ఆసిఫాబాద్అర్బన్: ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల వద్ద బుధవారం ఉదయం 9 గంటల లోగా ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం రిటర్నింగ్ అధికారి దాసరి వేణు, ఆర్డీవో సురేశ్‌తో కలిసి సెక్టోరియల్, రూట్ అధికారులతో సమావేశమయ్యారు. సామగ్రి పంపిణీ పూర్తి చేసి, సిబ్బందిని ఆయా రూట్లలోని పోలింగ్ కేంద్రాలకు పంపించాలన్నారు. ఈవీఎంల్లో సమస్యలు ఉత్పన్నమైతే ఈసీఎల్ ఇంజినీర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. వేగంగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

న్యూస్‌రీల్

'బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే'


మాట్లాడుతున్న రూప్‌నర్ రమేశ్

ఆసిఫాబాద్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం బీసీ సంఘం ఆధ్వర్యంలో పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రూప్‌నర్ రమేశ్ మాట్లాడుతూ వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం పూలే ఎంతో కృషి చేశారని కొనియాడారు. అంటరానితనం, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం బాలేశ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడే మారుతి, నాయకులు బొట్టుపెల్లి ప్రశాంత్, నాగపురి మనోహర్, కొటారె రవీందర్ పాల్గొన్నారు.

జోరుగా సాగిన మద్యం అమ్మకాలు

- నేడు, రేపు వైన్స్‌లు బంద్

ఆసిఫాబాద్: ఎన్నికల హడావుడి మొదలైనప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. గడిచిన రెండు నెలల్లో అమ్మకాలు పెరగడంతో భారీగా ఆదాయం సమకూరింది. ఈ నెల 30న ఎన్నికల నేపథ్యంలో బుధ, గురువారాల్లో వైన్స్‌లు మూసి ఉంచనున్నారు. జిల్లాలో 32 మద్యం దుకాణాలు, మూడు రెస్టారెంట్లు ఉన్నాయి. అక్టోబర్‌లో రూ.23,72,64,000 విలువ చేసే 24,715 ఐఎంఎల్ కేసులు, రూ.4,62,33,600 విలువ చేసే 24,080 బీర్ల కేసుల అమ్మకాలు జరిగాయి. అలాగే నవంబర్‌లో ఇప్పటివరకు రూ.14,35,32,000 విలువైన 19,935 ఐఎంఎల్ కేసులు, రూ.3,02,74,560 విలువైన 15,768 బీర్ల కేసుల విక్రయాలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు.

జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు


ఎంపికైన జిల్లా జట్టు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన మోడల్ క్రీడా పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి మహిళా కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ధర్మారావు మాట్లాడుతూ పోటీల్లో 42 మంది విద్యార్థినులు పాల్గొనగా 12 మందితో జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. సోంబాయి, అంచల్, సాత్విక, కల్యాణి, నాగేశ్వరి, శిరీష, దేవిక, వినూత్న, సరోజ, గంగాదేవి, రేఖ, శశిరేఖ డిసెంబర్ 4 నుంచి 6 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశిరావు, ఏసీఎంవో ఉద్దవ్, పీడీలు మధుసూదన్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన


సోంబాయిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: ఇటీవల జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న జిల్లా కేంద్రంలోని మహిళా గిరిజన డిగ్రీ గురుకుల కళాశాల విద్యార్థిని సోంబాయిని మంగళవారం ప్రిన్సిపాల్ దివ్యారాణి కళాశాలలో అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 22న కాకతీయ యూనివర్సిటీ తరఫున సౌత్ జోనల్ నుంచి సోంబాయి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ హారిక, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళాశాలలో విస్తృత ఉపన్యాస కార్యక్రమం
జిల్లా కేంద్రంలోని మహిళా గిరిజన డిగ్రీ గురుకుల కళాశాలలో విస్తృత ఉపన్యాస కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ దివ్యారాణి తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విస్తృత ఉపన్యాస కార్యక్రమంలో భాగంగా ఒక కళాశాల అధ్యాపకులు మరో కళాశాలకు వెళ్లి తమ సబ్జెక్టుపై ఉపన్యాసం ఇస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శారద, తెలుగు అధ్యాపకురాలు జ్యోతి, తిరుమల, శారద తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటేయండి

- ఎన్నికల ఏర్పాట్లు పూర్తి..
- భద్రతకు రెట్టింపు బలగాలు
- సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా
- కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షణ
- జిల్లా ఎన్నికల అధికారి హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్

సాక్షి, ఆసిఫాబాద్: శాసనసభ ఎన్నికల సమరానికి జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని, జిల్లా వాప్తంగా ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రతిఒక్కరూ ఈ నెల 30న తమ ఓటుహక్కు నిర్భయంగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 'జిల్లా వ్యాప్తంగా 599 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇందులో ఆసిఫాబాద్‌లో 305, సిర్పూర్ నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారితోపాటు సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు అదనపు పోలింగ్ అధికారులు విధుల్లో ఉంటారు. జిల్లాలో 92 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. ఆయా కేంద్రాల వద్ద కేంద్ర పారామిలటరీ బలగాలతో పహారా ఉంటుంది. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్‌రూం ఉంచి పర్యవేక్షిస్తాం. జిల్లాలో 438 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశాం. రెండు నియోజకవర్గాల్లో 87 మంది సెక్టోరియల్ అధికారులతోపాటు 174 మంది రూట్ అధికారులు విధుల్లో ఉంటారు. పోలింగ్ 90 నిమిషాల ముందు మాక్ పోలింగ్‌కు అవకాశం ఇస్తాం.'అని కలెక్టర్ హేమంత్ బోర్కడే వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. 'ప్రశాంత ఎన్నికల కోసం భద్రత బలగాలు సన్నద్ధంగా ఉన్నాయి. జిల్లాలో 71 సమస్యాత్మక, 62 మావోయిస్టు ప్రభావిత కేంద్రాలను గుర్తించాం. అక్కడ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశాం. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు ఉపయోగించేలా అవగాహన పెంచాం. ప్రచారం ముగిసింది కాబట్టి అభ్యర్థులు ఎవరూ ర్యాలీలు, రోడ్‌షోలు, సభలు నిర్వహించరాదు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు రూ.2.24 కోట్లు నగదు సీజ్ చేశాం. 1,924 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశాం. మంగళవారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.' అని తెలిపారు.

జిల్లా వివరాలు

ఓటర్లు	4,53,538
పురుషులు	2,26,844
మహిళలు	2,26,666
ట్రాన్స్‌జెండర్లు	28
పోటీలో ఉన్న అభ్యర్థులు	30
పోలింగ్ కేంద్రాలు	599

ఎన్నికల అధికారులు ఇలా..

ప్రిసైడింగ్ అధికారులు	719
సహాయ ప్రిసైడింగ్ అధికారులు	719
పోలింగ్ అధికారులు	1,438
మైక్రో అబ్జర్వర్లు	94
సెక్టోరియల్ అధికారులు	87
రూట్ అధికారులు	174

పోలింగ్‌కు సిద్ధంగా ఉండాలి

- కేంద్ర ఎన్నికల డిప్యూటీ కమిషనర్ నితేశ్‌కుమార్ వ్యాస్


వీసీలో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎన్నికల పరిశీలకులు

ఆసిఫాబాద్: పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కేంద్ర ఎన్నికల డిప్యూటీ కమిషనర్ నితేశ్‌కుమార్ వ్యాస్ అన్నారు. ఢిల్లీ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ గురువారం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేశామని తెలిపారు. 92 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 10 కంపెనీల సీఆర్‌పీఎఫ్ దళాలు, హోంగార్డులు, పోలీసు అధికారులతో భద్రతా ఏర్పాట్లు చేశామని వివరించారు.

'వందశాతం' పోలింగ్‌పై దృష్టి

- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్‌ను పెంచేందుకు ఎన్నికల సంఘం చర్యలు
- జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు అమలు
- ప్రత్యేక హోర్డింగులతోనూ ప్రచారం
- గత ఎన్నికల్లో 86.11 శాతం పోలింగ్ నమోదు



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్

తిర్యాణి(ఆసిఫాబాద్): అసెంబ్లీ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదుకు ఎన్నికల సంఘం, జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల ప్రకియ మొదలైనప్పటి నుంచి వివిధ పద్ధతుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతీ పౌరుడు తమ ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ఓటుహక్కు వృథా చేసుకోవద్దనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది.

జిల్లాలో 4,53,538 ఓటర్లు..
జిల్లాలో రెండు నియోజకవర్గాలు ఆసిఫాబాద్, సిర్పూర్ ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల్లో 4,53,538 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు విస్తృత చర్యలు చేపడుతున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 305, సిర్పూర్‌లో 294 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో మహిళలు, దివ్యాంగులు, యువత కోసం ప్రత్యేకంగా కొన్ని కేంద్రాలను ఎంపిక చేసి ముస్తాబు చేస్తున్నారు. 10 మహిళా పోలింగ్ కేంద్రాలు, రెండు దివ్యాంగుల కోసం, 12 మోడల్, మరో రెండు యూత్ మేనేజ్డ్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అంతేకాక ఓటుహక్కు విలువను ప్రజలకు తెలియజేసి వారిని చైతన్యవంతం చేసేలా ప్రధాన కూడళ్లు, కార్యాలయాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన సౌక్యరాలు సైతం కల్పిస్తున్నారు. దివ్యాంగుల కోసం ర్యాంపుల నిర్మాణంతోపాటు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచనున్నారు. అలాగే ఎన్నికల రోజు దివ్యాంగులను ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి తరలించేలా ప్రత్యేక వాహనాలు సైతం సిద్ధం చేస్తున్నారు. ఈ విధానాలతో ఓటింగ్ శాతం గతం కంటే ఎక్కువగా నమోదవుతుందని అధికారులు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గంలో 85.96 ఓటింగ్ శాతం నమోదు కాగా.. ఆసిఫాబాద్‌లో 86.27 పోలింగ్ నమోదైంది. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 86.11 పోలింగ్ శాతం నమోదైంది.

బీఎల్‌వోలకు బాధ్యతలు
ఓటుహక్కు ప్రాధాన్యతను తెలియజేసేలా బీఎల్‌వోలు కరపత్రాల ద్వారా కొద్దిరోజులుగా క్షేత్రస్థాయిలో ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్ల వద్ద ఈవీఎం, వీవీప్యాట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రధాన మార్కెట్‌లను గుర్తించి మాక్‌పోలింగ్ సైతం నిర్వహించారు. ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని హోర్డింగులు సైతం ఏర్పాటు చేశారు.

దివ్యాంగులకు భరోసా కల్పించాలి

- రిజర్వేషన్లు, వార్షిక బడ్జెట్ పెంచాలి
- స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి

దివ్యాంగుల ఎజెండా



ఆసిఫాబాద్అర్బన్: 'ఇతరులపై ఆధారపడకుండా సమాజంలో తలెత్తుకు బతకాలంటే మాకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి.. రుణాలు అందిస్తే మా కాళ్లపై మేము నిలబడతాం..' అని దివ్యాంగులు గొంతెత్తి చెబుతున్నారు. త్వరలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్న నేపథ్యంలో దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరుతున్నారు. ప్రజా ఎజెండాలో భాగంగా 'సాక్షి' మంగళవారం పలువురు దివ్యాంగులను పలకరించగా వారు అభిప్రాయాలు వెల్లడించారు.

అవగాహన లేక..




జిల్లాలో చాలా మంది అర్హులకు పింఛన్లు అందడం లేదు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన దివ్యాంగుల్లో చాలా మంది నిరక్షరాసులులే. దీంతో వారికి సదరం సర్టిఫికెట్లు పొందడం, పింఛన్లకు దరఖాస్తు చేసుకోవడంపై అవగాహన ఉండటం లేదు. అధికార యంత్రాంగమే ఇందుకు చొరవ తీసుకోవాలి.
– మార స్వరూపారాణి, ఆసిఫాబాద్

ఉద్యోగావకాశాలు కల్పించాలి



విద్యార్హతకు అనుగుణంగా దివ్యాంగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి. ప్రత్యేక శిక్షణ అందించి బ్యాక్‌లాగ్ పోస్టులు తమతోనే భర్తీ చేయాలి. ఉచితంగా మూడు చక్రాల బండితోపాటు రూ.5లక్షల వరకు సబ్సిడీ రుణాలు అందించాలి.
– కొసార్‌కార్ అనీల్, మొగడ్‌దగడ్, మం.కౌటాల

ప్రతినెలా 5లోగా అందించాలి



ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న పింఛన్లు ప్రతినెలా 5లోగా అందేవిధంగా చర్యలు తీసుకోవాలి. నకిలీ పత్రాలతో పింఛన్లు పొందుతున్న అనర్హులను గుర్తించాలి. ప్రస్తుత ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చిన పార్టీలు గెలవగానే అమలు చేయాలి.
– వారణాసి దత్తాత్రి, ఆసిఫాబాద్

పకడ్బందీగా అమలు చేయాలి



సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి. దివ్యాంగులకు రూ.10లక్షలు అందించి స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించాలి. చట్టసభల్లోనూ తమకు అవకాశం కల్పిస్తే మాకు ప్రతినిధ్యం లభిస్తుంది. మా సమస్యలు ప్రపంచానికి తెలుస్తాయి.
– సంతోష్, ఆసిఫాబాద్

ప్రత్యేక బడ్జెట్ అవసరం



దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్ అవసరం. ప్రస్తుతం కేటాయించే నిధులను రెట్టింపు చేయాలి. ప్రత్యేక ఆస్పత్రులు నిర్మించి తమపై ఆర్థిక భారం పడకుండా మెరుగైన వైద్యం అందించాలి. అలాగే రిజర్వేషన్లను సైతం పెంచి అండగా నిలవాలి.
– పిన్నా రమ, ఆసిఫాబాద్

క్లుప్తంగా

కాంట్రాక్టు కార్మికుల అసంతృప్తి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సివిల్ కార్మికుల డిస్ట్రిబ్యూషన్ కార్యాలయం వద్ద టీబీజీకేఎస్ సమావేశంలో కాంట్రాక్టు కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో సంఘం మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర కమిటీ నాయకులు బడికెల సంపత్ మాట్లాడుతుండగా కాంట్రాక్టు కార్మికులు వెనుదిరిగారు. ఈ సంఘటనతో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు సివిల్ కార్యాలయ ఆవరణలోకి వెళ్లి కార్మికులను సముదాయించే ప్రయత్నం చేశారు. లాభాల్లో వాటా ఇప్పించలేదని, ఉచిత వైద్య సదుపాయం తదితర సమస్యలు పట్టించుకోలేదని కాంట్రాక్టు కార్మికులు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పినా వారు వినిపించుకోలేదు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

దండేపల్లి(మంచిర్యాల): ఈ నెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై కుందారపు ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన అడప ప్రశాంత్(33)కు పెళ్లయి విడాకులయ్యాయి. అప్పటి నుంచి ఒంటరి జీవితం సాగిస్తున్నాడు. వ్యవసాయంలో కూడా నష్టాలు రావడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ నెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

బెల్లంపల్లి: పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం పట్టుబడినట్లు ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. బెల్లంపల్లి రాంనగర్ బస్తీకి చెందిన సాగల రాజేశం, కంది మల్లేశ్ వద్ద ఉన్న బాక్స్‌ను తనిఖీ చేయగా రాయల్ స్టాగ్ 180 ఎంఎల్ బాటిల్స్ కాటన్, కింగ్ ఫిషర్ బీర్స్ కాటన్లు 4, ఆఫీసర్స్ ఛాయిస్ 180 ఎంఎల్ బాటిల్స్ 60, డెక్కన్ బ్లూ 180 ఎంఎల్ బాటిల్స్ 14 లభించాయి. వాటి విలువ రూ.56 వేలు ఉంటుందని, ఇంటి వద్ద నిర్వహిస్తున్న బెల్ట్‌షా పులో అమ్మకానికి తీసుకెళ్తున్నట్లు నిందితులు అంగీకరించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పెట్రోల్‌కు ఫుల్ గిరాకీ



జిల్లా కేంద్రంలోని పెట్రోల్ బంకులో క్యూ

మంచిర్యాలటౌన్: ఎన్నికల పుణ్యమా అని అన్ని వ్యాపారాలకు ఫుల్ గిరాకీ ఉంటోంది. ఎన్నికల ప్రచారంలో పలు పార్టీల తరఫున ప్రచారం చేస్తున్న వారికి టీలు, టిఫిన్లు, భోజనంతో పాటు, అవసరాన్ని బట్టి మందు అందిస్తున్నారు. ఫ్లెక్సీలు, జెండాలు, ఆటోలు, ఆటో ట్రాలీలకు గిరాకీ పెరిగింది. ఇటీవల ప్రముఖులు పట్టణానికి వచ్చి రోడ్‌షోలు నిర్వహించగా ఎన్నికల ప్రచారం చివరి రోజున కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు మంచిర్యాలలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. రెండు పార్టీలకు కార్యకర్తలు పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాలతో హాజరయ్యారు. వేలాది వాహనాలు రోడ్డెక్కడంతో పెట్రోలు కోసం పట్టణంలోని బంకులకు క్యూ కట్టాయి. ఒకేసారి వేలాది వాహనాలు పెట్రోల్ కోసం రావడంతో బంకుల్లో సందడి నెలకొంది.

ప్రచార శైలిలో మార్పులు..

- కాలినడక నుంచి హెలీక్యాప్టర్ వరకు
- ప్రచారాల్లో జాతీయ నాయకులు సైతం
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): నాటి నుంచి నేటి వరకు ప్రచార శైలిలో వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయి. నాడు కేవలం కాలినడకన జరిపే ప్రచారం ఇప్పుడు హెలీక్యాప్టర్ల వరకు చేరుకుంది. అప్పుడు ప్రచారానికి అన్నిమార్గాలను వినియోగిస్తూ ప్రజలకు చేరువయ్యారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, బీజేపీ నుంచి అమిత్‌షా, ఈటల రాజేందర్, యోగి ఆదిత్యనాథ్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కాంగ్రెస్ నుంచి మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఇలా ప్రముఖులు హెలీక్యాప్టర్లలో వచ్చి ప్రచార సభల్లో పాల్గొని పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపారు.

ఉదయం నుంచి రాత్రి వరకు..

గతంలో చేతిలో మైకు చేతపట్టుకుని రిక్షాల్లో తిరుగుతూ ఇంటింటా ప్రచారం చేసేవారు. సైకిళ్లు, ఎడ్ల బండ్లతోపాటు జీపులను వినియోగిస్తూ ప్రచారం చేపట్టేవారు. కానీ ఇప్పుడు ఆటోలు, టాటా ఏస్‌లల్లో బ్లూటూత్, డీజే సౌండ్ ఏర్పాటు చేసి తమ పార్టీ గుర్తుకు ఓటేస్తే అభివృద్ధి చేస్తామంటూ పెద్దపెద్ద స్పీకర్లు పెట్టి పొద్దంతా ప్రచారం చేస్తున్నారు. తిరగకుండా, అలసిపోకుండా ఈ ఆటోప్రచారం బలాన్ని చేకూరుస్తోంది. పాదయాత్రలు, బైక్‌ర్యాలీలతో ప్రచారం చేస్తుండటంతో పాటు వివిధ రకాల కార్లతో పెద్ద కాన్వాయ్‌తో గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏ గ్రామానికి, ఏ పట్టణానికి వెళ్లినా ఆయా పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు మందీ మార్బలంతో పదుల సంఖ్యలో కార్లు, ఇతర వాహనాల్లో వెళ్తూ ప్రచారం చేశారు.

ఆకాశ మార్గాన ప్రచారాల్లో ప్రముఖులు

ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు జాతీయ స్థాయి ప్రముఖులు హెలీక్యాప్టర్లలో పార్టీల ప్రచారానికి వస్తూ ఓ వైపు ఓటర్లను ఆకర్షిస్తూ మరోవైపు పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపారు. పార్టీ బహిరంగ సభలు ఎక్కడున్నా ఆ పార్టీల ప్రముఖులు త్వరితగతిన చేరుకుని ప్రచారం చేశారు. ఒక్కరోజులో నాలుగు సభల్లో పాల్గొంటూ ప్రచారాన్ని హోరెత్తించారు. తక్కువ సమయంలో ఎక్కువ సభలను చుట్టేస్తూ బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల ప్రముఖులు హెలీక్యాప్టర్లను ఉపయోగించారు. గతంలో ఎక్కడ సభలు ఉన్నా రోడ్డు మార్గాన వెళ్లే నేతలు ఇప్పుడు ఆకాశ మార్గాన వెళ్తూ రోడ్ షోలు, సభల్లో పాల్గొన్నారు.

భారీ మైదానాలు.. ఎల్ఈడీ తెరలు

అప్పట్లో చెట్ల కింద, రచ్చబండల వద్ద సభలు, సమావేశాలు జరిగేవి. ఇప్పుడు విశాలమైన మైదానాల్లో పెద్ద పెద్ద షామియానాలు ఏర్పాటు చేస్తూ కుర్చీలు వేస్తూ మరీ ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. ప్రత్యేక వాహనాల్లో ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేసి మరీ వీడియోలు, తాము చేసే కార్యక్రమాలను వివరిస్తూ ప్రజల్లో తమ పార్టీలపై అభిమానం పెంచుకునేలా చూశారు. చివరన రోడ్‌షోలతో ప్రచారానికి మరింత ఊపునిచ్చారు. ప్రధాన కూడళ్లలో పార్టీ ప్రధాన నేతల ప్రసంగాలను ఎల్ఈడీ తెరల ద్వారా వీక్షించేలా ఏర్పాటు చేశారు.

గుస్సాడీలు.. కళాకారుల సందడి

గిరిజన సంప్రదాయాలతో పాటు జానపద కళాకారులతో కూడా పార్టీలు ప్రచారం నిర్వహించాయి. ప్రచారాలకు ప్రముఖులు వచ్చే ముందు గుస్సాడీల నృత్యాలు, కళాకారుల ఆటపాటలతో ప్రజలను అలరించారు. ఎమ్మెల్యేగా గెలిస్తే తాము చేసే పనులను పాటల రూపంలో వివరిస్తూ హోరెత్తించారు. మొత్తంగా ఎన్నికల ప్రచారానికి తెరపడడంతో పార్టీల ప్రచారం ప్రశాంతంగా ముగిసింది.

మీకు తెలుసా..

చూపుడు వేలుకు సిరా..

సాక్షి, మంచిర్యాలడెస్క్: ఎన్నికల్లో పోలింగ్ రోజున ఓటు వినియోగించుకున్న ఓటర్లను గుర్తించేందుకు వీలుగా చేతి వేలికి చెరిగిపోని సిరా వేస్తారు. ఓటు వేయడానికి ముందే ఓటర్ల ఎడమ చేయి చూపుడు వేలుకు సిరా వేస్తారు. గోరు మీది నుంచి వేలి మొదటి జాయింట్ వరకు వేస్తారు. ఆ తర్వాతే ఓటు వేయాల్సి ఉంటుంది. ఎడమ చేయి చూపుడు వేలు లేని పక్షంలో మధ్య వేలు.. లేదంటే ఉంగరపు వేలు, లేదా చిటికెన వేలు, బొటన వేలికి గానీ వేస్తారు. ఎడమ చేయి లేనిపక్షంలో ఇదే వరుసలో కుడిచేతికి సిరా పెట్టాల్సి ఉంటుంది. రెండు చేతులకు వేళ్లు లేనట్లయితే ఎడమ భుజం, ఏదైనా కనిపించే ప్రదేశం, మరియు ముఖంపై సిరాతో గుర్తించాల్సి ఉంటుంది. ఎవరైనా ఓటు వేయలేని స్థితిలో ఉంటే వారు ఓటు వేయడానికి సహకరించేందుకు వెళ్లే వారికి కుడి చేతి చూపుడు వేలుకు సిరా వేస్తారు.



ప్రజా ఆయుధం



వామన్‌రావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మంచిర్యాల

రాజ్యాంగము నీకొసగిన
మహాయుధం
శివుని చేతిలో త్రిశూలం
విష్ణుచేతిలో చక్రా
యుధం
జనులచేతిలో స్వేచ్ఛా
యుధం
ఓటే కదా ప్రజాయుధం
నమ్ముకోవోయ్ సోదరా
అమ్ముకోకోయ్ చౌకగా
దమ్ముతోడ నిలవరా
వమ్ము చేయకు నీదు ఆశల
సొమ్ములల్ల సొమ్మ సిల్లక
నిన్న మొన్నటి ఓటులట్లు
వేయబోకు నేడు అట్లు
మత్తులందు చిత్తులవక
కులమతాల సుడులు ఒడక
నోటు వేటుల పాతరవక
ఎత్తుకోవోయ్ ఓటు మంత్రం
నేటి ఓటు మేటి తంత్రం
ప్రగతి బాటకు
ప్రజాయుధమ్మని
స్వేచ్ఛాయుధ
ఓటు ఘనతను

– మంచిర్యాల అర్బన్

సింగరేణిలో సోలార్ వెలుగులు



సోలార్ ప్లేట్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా స్తంభాలు

- శివలింగాపూర్ సమీపంలో పూర్తిదశకు చేరుకున్న నిర్మాణం
- ఎల్లక్కపేట వద్ద మరో ప్లాంట్ నిర్మాణానికి సన్నాహాలు



శివలింగాపూర్ వద్ద సోలార్ పవర్ ప్లాంట్

చెన్నూర్‌రూరల్: సింగరేణిలో సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణానికి యాజమాన్యం శ్రీకారం చుట్టింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కార్మికుల నివాస ప్రాంతాల్లో మొక్కలు పెంచుతోంది. శ్రీరాంపూర్ ఏరియాలోని చెన్నూర్ మండలం శివలింగాపూర్ గ్రామ సమీపంలో ఇప్పటికే సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టింది. ఎల్లక్కపేటలో 27.5 మెగావాట్ల మరో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇటీవల అధికారులు స్థలాన్ని కూడా పరిశీలించారు. శివలింగాపూర్ సమీపంలోని 55 ఎకరాల్లో 64.5 కోట్ల వ్యయంతో చేపట్టిన 11 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంటు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. టెండర్ దక్కించుకున్న పూణేకు చెందిన ఎస్‌రిచ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్మాణ పనులు చేపడుతోంది. ఆర్నెళ్ల క్రితం పనులు ప్రారంభించగా వేగవంతంగా కొనసాగుతున్నాయి. సోలార్ ప్లేట్లను ఏర్పాటు చేసేందుకు పూర్తి మొత్తంలో స్తంభాలను ఏర్పాటు చేశారు. కొంత జాప్యంతో మొదటగా 5 మెగావాట్ల పనులను డిసెంబర్‌లో పూర్తి చేసి మిగతా ఆరు మెగావాట్లను జనవరిలోగా పూర్తి చేయనున్నారు. ఇక్కడ ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఎన్‌పీడీసీఎల్‌కు అనుసంధానం చేయనున్నారు.

ఎల్లక్కపేటలో మరో సోలార్ పవర్ ప్లాంట్..

ఎల్లక్కపేటలోని మూతపడ్డ 1ఇంక్‌లైన్ గని ఆవరణలో మరో సోలార్ పవర్‌ప్లాంట్ నిర్మాణానికి ప్రక్రియ సిద్ధం చేశారు. సుమారు రూ.160 కోట్ల అంచనా వ్యయంతో 27.5 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకు గానూ టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కావస్తోంది. వచ్చే ఏడాదిలో పనులను ప్రారంభించనున్నారు. సోలార్ పవర్ ప్లాంటు నిర్మాణంతో ఇక్కడి స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అంతే కాకుండా నిర్మాణ సమయంలో కూడా చాలా మంది కూలీలకు పనులు లభిస్తాయని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

సోలార్ ప్లాంట్ల నిర్మాణం చేపడుతున్నాం

చెన్నూర్ ప్రాంతంలో రెండు సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణాలకు సింగరేణి సంస్థ శ్రీకారం చుట్టింది. శివలింగాపూర్ సమీపంలో ప్లాంటు నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. ఎల్లక్కపేట వద్ద మరో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తి కావస్తోంది. త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నారు.
– సంజీవరెడ్డి, జీఎం, శ్రీరాంపూర్ ఏరియా

హోరాహోరీగా జోనల్‌స్థాయి పోటీలు



బెల్లంపల్లి : పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో



ఆసిఫాబాద్ : పోటీలు ప్రారంభిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా మోడల్ స్కూల్‌లో మంగళవారం అథ్లెటిక్స్ బాలికల జోనల్ స్థాయి పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, ఏసీఎంవో ఉద్దవ్, డీఎస్‌వో మీనారెడ్డి జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. అథ్లెటిక్స్ అండర్ 14, 17 విభాగంలో రన్నింగ్, షాట్‌పుట్, హైజంప్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 120 మంది విద్యార్థులు పోటీలో పాల్గొనగా 40 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో శకుంతల, హెచ్‌ఎం కృష్ణారావు, అథ్లెటిక్స్ శిక్షకులు విద్యాసాగర్, అరవింద్ పీడీలు పీఈటీలు మల్లేశ్, ధనలక్ష్మి, అనిల్, స్వప్న, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలు

బెల్లంపల్లి: పట్టణంలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) కళాశాలలో మంగళవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జోనల్‌స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అండర్–17 బాలుర విభాగంలో 100, 200, 400, 800, 1500 మీటర్లు, 3కే, హైజంప్, లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్, షాట్‌పుట్, డిస్కత్రో, తదితర అంశాలలో నిర్వహించిన పోటీల్లో పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సెక్రటరీ బొంకూరి బాబురావు, సీవోఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరి పరిమళ, కాసిపేట బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, నడిగొటి రాజేశ్, రఘు ,శ్రీకాంత్, సల్పాల సంతోష్, గాందర్ల సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకరికి రూ.3వేల జరిమానా

జన్నారం(ఖానాపూర్): ఒకరిని చంపుతానని బెదిరించిన వ్యక్తికి రూ.3 వేల జరిమానా విధిస్తూ లక్సెట్టిపేట న్యాయవాది మహ్మద్ అసదుల్ల షరీఫ్ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. బాదంపల్లికి చెందిన లక్ష్మీకాంతరావు 1984 లో పొనకల్ శివారులోని సర్వేనంబర్ 385/అ/1/1 లో 8 గుంటల 90 గజాల భూమిని ఎండీ ఖలీమొద్దీన్ వద్ద కొనుగోలు చేశాడు. అట్టి స్థలంలో ఇంటిని నిర్మించి ఓ పాఠశాలకు లీజ్‌కు ఇచ్చాడు. లీజు పూర్తి కాగానే పాఠశాల ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఎండీ ఖలీమొద్దీన్, ఎండీ అమీజుద్దీన్ అట్టి ఇంటిని కూలగొట్టి అడ్డువచ్చిన తనను చంపుతానని బెదిరించారని 27.03.2017లో లక్ష్మీకాంతరావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేశాడు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి ఎండీ అమీజుద్దీన్‌కు రూ.3 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.

పెళ్లింట విషాదం

- బావిలో పడి పెళ్లికొడుకు మృతి



పెండ్యాల వినయ్ (ఫైల్)

దండేపల్లి: మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల కేంద్రంలోని పెళ్లింట విషాదం చోటు చేసుకుంది. మరో రెండ్రోజుల్లో ఆ ఇంట్లో పెళ్లి జరగాల్సి ఉండగా..పెళ్లికొడుకు బావిలో పడి మృతిచెందాడు. మృతుడి కుటుంబీకులు, ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. దండేపల్లికి చెందిన పెండ్యాల నారాయణ–పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుమారులు ఇద్దరూ రైల్వేలో ఉద్యోగం చేస్తున్నారు. పెద్ద కుమారుడు వినయ్(28)కు ఇటీవల పెళ్లి నిశ్చయమైంది. బుధవారం పెళ్లి జరగాల్సి ఉంది. మంగళవారం వేకువజామున ఇంటి సమీపంలోని బావిలో శవమై తేలాడు. ఈ నెల 26న రాత్రి అందరూ భోజనం చేసి పడుకున్నారు. 27న ఇంట్లో అతను కనిపించకపోవడంతో ఆచూకీ కోసం వెతకడంతోపాటు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం తెల్లవారుజామున ఇంటి సమీపంలోని బావిలో వినయ్ మృతదేహం లభ్యమైంది. కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయి ఉంటాడని కుటుంబీకులు భావిస్తున్నారు. ఈ మేరకు మృతుడి సోదరుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, ఈ నెల 29న వినయ్ పెళ్లి జరగాల్సి ఉండగా ఇంతలోనే మృతిచెందడంతో ఆ ఇంట తీరని విషాదం నెలకొంది. ఉద్యోగం సాధించిన కొడుకు కుటుంబానికి అండగా ఉంటాడనుకునే సమయంలో విధి చిన్న చూపు చూసింది.

బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌పై బదిలీ వేటు

సాక్షి స్పందన



కమిషనర్ సమ్మయ్య

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచార లెక్కల్లో అవకతవకలకు పాల్పడిన బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్యపై బదిలీ వేటు పడింది. కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం రాత్రి సమ్మయ్యను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అతని స్థానంలో మున్సిపల్ రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న భుజంగంకు ఫుల్ అడిషనల్ చార్జీతో కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. సమ్మయ్యను వెంటనే హైదరాబాద్ సీడీఎంఏకు రి పోర్టు చేయాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. 'ప్రచార అనుమతి లెక్కల్లో తేడాలు' శీర్షికన ఈ నెల 16న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. వార్తా కథనం క్లిప్పింగ్‌ను కొందరు రాష్ట్ర ఎన్నికల కమి షన్‌కు పంపించారు. లెక్కల అక్రమాలపై ఈ నెల 24న మున్సిపల్ కార్యాలయంలో జెడ్పీ సీఈవో, ఇతర అధికారులు విచారణ జరిపి ఫిర్యాదుదారుల నుంచి ఆధారాలు సేకరించి మూడురోజుల క్రితం నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. టౌన్ ప్లానింగ్ నియమాలను సరిగా పాటించక పోవడం , ప్రచార అనుమతి లెక్కల అంకెలను దిద్ది అక్రమాలకు పాల్పడినట్లు రుఢీ కావడంతో బదిలీ వేటు వేశారు. కమిషనర్ అక్రమాలను వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'ని పలువురు అభినందించారు.

మూడ్రోజులు వైన్‌షాపులు బంద్

- బార్లు, వైన్స్ షాపులు సీజ్
- డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం పాలసీ అమలు



దండేపల్లి: వైన్‌షాపు మూసేస్తున్న ఎక్సైజ్ సీఐ

మంచిర్యాలక్రైం/మందమర్రిరూరల్/దండేపల్లి: ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 28 మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 30వ తేదీ వరకు మూడు రోజులు వైన్స్, బార్‌షాపులు బంద్ చేయాలని భారత ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం జిల్లాలోని 73 వైన్స్ షాపులు, 16 బార్లను జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి నందగోపాల్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. పాత మద్యం పాలసీ ఈ నెల 30న ముగియనుండడంతో మద్యం వ్యాపారులు తమ దుకాణాల కాల పరిమితి ఎన్నికల నేపథ్యంలో మూడు రోజుల ముందే షాపులు మూసివేయడంతో వ్యాపారుల్లో అసంతృప్తి నెలకొంది. మళ్లీ కొత్త మద్యం పాలసీలో భాగంగా డిసెంబర్ 1 నుంచి మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి.

డంప్‌యార్డులా పాఠశాల మైదానం..



బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో పడేసిన పేపర్ ప్లేట్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల పట్టణం, పరిసర ప్రాంత ప్రజలకు వాకింగ్, జాగింగ్ కోసం అనువుగా ఉన్నవి రెండే మైదానాలు. డిగ్రీ కళాశాలతో పాటు బాలుర ఉన్నత పాఠశాల మైదానం. బాలుర పాఠశాల మైదానం ఇప్పుడు పోలీస్ పరేడ్ మైదానంగా మారినా తీరు మారడం లేదు. వాకింగ్, జాగింగ్, ఇతర ఆటల కోసమే కాదు సభలు, సమావేశాలు, విందులకు వినియోగిస్తున్నారు. దీంతో తిన్న పేపర్‌ప్లేట్లు అక్కడే పడేయడంతో ఆ మైదానం పూర్తిగా డంప్‌యార్డును తలపిస్తోంది.

'ఓటేద్దాం రండి' ఓటరు చైతన్య గీతం



యోగేశ్వర్‌ను అభినందిస్తున్న కలెక్టర్

మంచిర్యాలటౌన్: ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ ఓటు వేసి సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, గుండేటి యోగేశ్వర్ ఓటరు చైతన్య గీతం రాశారు. కలెక్టర్ బి.సంతోష్ చేత అభినందనలు అందుకున్నారు.

రండి రండి రండి... ఊరు వాడ కదలి రండి
అమ్మలార అక్కలార... అన్నలారా అయ్యలారా
చేయి చేయి కలిపిరండి... సకల జనులారా రండి
ఓటేద్దాం రండి... భవితకు బాటేద్దాం రండి
భారత దేశ పౌరులమై... తెలంగాణ ఓటరువై
ప్రజాస్వామ్య రక్షణకై.. భావితరం భద్రతకై
గురితప్పని ఆయుధమై... పౌరులుగా బాధ్యులమై
మనోడని చూడకుండా.. మంచికి ఓటేద్దాం రండి
రంగు మార్చే నాయకులను.. నమ్మి ఓటేయకండి
ఎరలు చూపే గాలాలకు... లొంగకుండా ఎన్నుకోండి
మందు విందు కానుకలకు... ఆశపడి వేయకండి
మాయమాట నమ్మకుండ... ఓటు బలం చాటరండి
ఎక్కడున్నా ఊరికచ్చి... అందరిని తీసుకచ్చి
ఎన్నికల తేదీ రోజు... గుర్తింపు కార్డుతో వచ్చి
ఓపికగా మనమంతా... ఊరువాడ కదలివచ్చి
ఓటేద్దాం రండి.. భవితకు బాటేద్దాం రండి

రూ.15.81లక్షల నగదు పట్టివేత

- మంచిర్యాల నుంచి చెన్నూర్‌కు వెళ్తున్నట్లు సమాచారం
- పోలీసుల అదుపులో ఇద్దరు, పరారీలో మరో ఇద్దరు



మంచిర్యాలలో నగదు తరలిస్తున్న వారిని విచారిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి మధూకర్

మంచిర్యాలక్రైం: ఎలాంటి ఆధారాలు లేకుండా, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి తరలిస్తున్న రూ.15.81లక్షల నగదును మంచిర్యాలలో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ మంగళవారం పట్టుకున్నారు. ఎస్సై మహేందర్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి మధూకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల నుంచి కారులో నగదు తరలిస్తున్నారనే సమాచారం మేరకు పట్టణంలోని చున్నంబట్టివాడ ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. భీమారం మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన పోడేటి రవి, భూక్య లక్ష్మణ్, మరో ఇద్దరు వ్యక్తులు ఇన్నోవా వాహనంలో రూ.15.81లక్షలు నగదు తరలిస్తుండగా పట్టుకున్నారు. రవి, లక్ష్మణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. నగదును సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, నగదు తరలిస్తున్న కారులో కండువాలు ఉండడంతో ఓ జాతీయ పార్టీకి చెందిన వారనే ఆరోపణలున్నాయి. వారిద్దరు భీమారం మండలానికి చెందిన వారు కావడంతో జాతీయ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థికి చెందిన అనుచరులే మంచిర్యాల నుంచి చెన్నూర్‌కు తరలిస్తున్నట్లు తెలిసింది.

పట్టుబడిన రూ.8.17లక్షలు

నస్పూర్: మంచిర్యాల జిల్లా సీసీసీ బంగ్లాస్ ఏరియాలో రూ.8.17లక్షలు నగదు పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మంగళవారం సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేయగా కారులో భీమారం మండలానికి చెందిన బీరేష్, మోహన్‌రెడ్డి నగదు తరలిస్తూ పట్టుబడ్డారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.